క్లుప్తంగా

కాకినాడ జీఆర్పీ ఎస్సైగా సత్తిబాబు బాధ్యతల స్వీకరణ



కాకినాడ క్రైం: కాకినాడ గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఎస్సైగా వాసంశెట్టి సత్తిబాబు నియమితులయ్యారు. కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో ఉన్న జీఆర్పీ స్టేషన్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్వస్థలం కాజులూరు గ్రామం. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన, శిక్షణ అనంతరం అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో యాంటీ నక్సల్ స్క్వాడ్‌లో పని చేశారు. 2020లో కృష్ణా జిల్లా గన్నవరానికి బదిలీపై స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. అక్కడి నుంచి గన్నవరం లా అండ్ ఆర్డర్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీలో భాగంగా అక్కడి నుంచి కాకినాడ జీఆర్పీకి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రవికుమార్ విజయవాడ జీఆర్పీకి బదిలీపై వెళ్లారు.

భావనారాయణ స్వామి ఆలయ ఈఓగా సూర్యనారాయణ



కాకినాడ రూరల్: సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా టీబీ సూర్యనారాయణ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈఓగా పనిచేస్తున్న మాచిరాజు లక్ష్మీ నారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో తిమ్మాపురం గ్రూపు దేవాలయాల కార్య నిర్వహణాధికారిగా గ్రేడ్-1 హోదాలో పని చేస్తున్న సూర్యనారాయణ సర్పవరం ఆలయ బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా పూరీ జగన్నాథుని రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: ఇస్కాన్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో అంగరంగ వైభవంగా పూరీ జగన్నాథుని రథయాత్ర నిర్వహించారు. స్థానిక మధురానగర్‌లోని గోకులం ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర మెహర్‌నగర్, భానుగుడి సెంటర్, మెయిన్‌రోడ్డు, గోల్డ్ మార్కెట్ సెంటర్, సినిమారోడ్డు మీదుగా సూర్యకళా మందిరానికి చేరుకుంది. పూరి జగన్నాథుడి వైభవాన్ని రాజమహేంద్రవరం ఇస్కాన్ బాధ్యులు సత్యగోపీనాథ్ వివరించారు. శోభాయాత్రలో కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కాకినాడ క్రైం: కాకినాడ శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్, చవ్వాకుల సందీప్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది యువకులు సోమవారం రక్తదానం చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్ జన్మదినం సందర్భంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రోహిణి



రోహిణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్: క్రమ శిక్షణకు మారుపేరుగా, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన ఆదర్శ ఉపాధ్యాయిని కేకేడీకే రోహిణి అని, ఆమె ఎందరో చిన్నారులను విద్యావంతులకు తీర్చిదిద్దారని ఇంద్రపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.ఇస్సాక్ అన్నారు. ఉపాధ్యాయిని రోహిణి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, బంధువుల సమక్షంలో ఆమెను ఘనంగా సన్మానించి, ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకుడు గిరిధర గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కుమార షష్ఠి

సామర్లకోట: కుమార షష్ఠి సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన కుమార స్వామి ఆలయంలో మంగళవారం కుమార షష్ఠి వేడుకలు జరుగుతాయని ఈఓ బళ్ల నీలకంఠం సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పట్టు వస్త్రాలతో అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈఓ కోరారు. అలాగే ఆలయంలో ఉన్న మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా గురువారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని చెప్పారు.

బెదరహో దారులు

- కుంభాభిషేకం రోడ్డుకు మోక్షమెప్పుడో?
- గతుకులతో ప్రయాణం నిత్య నరకం
- తూతూమంత్రంగా మరమ్మతులు
- ప్రస్తుతం పూర్తిగా ఛిద్రమైన రహదారి



ఛిద్రంగా మారిన దుమ్ములపేట-కుంభాభిషేకం రోడ్డు

కాకినాడ రూరల్: మేం అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దేస్తామంటూ కూటమి నేతలు లేనిపోని ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక తూతూమంత్రంగా గతుకులు పూడ్చి.. అంతా టచ్ అనిపించారు. కీలకమైన రహదారుల దుస్థితి చూస్తే ఈ విషయం అవగతమవుతుందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నగరం నుంచి పోర్టు ఏరియాకు వెళ్లేందుకు డెయిరీ ఫారమ్ సెంటర్, దుమ్ములపేట మీదుగా కుంభాభిషేకం రేవు వరకు ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టి రాకపోకలు సాగిస్తున్నారు. పెద్ద గోతులతో పాటు, తప్పించుకోవడానికి వీల్లేని విధంగా రోడ్డంతా గతుకులతో నిండిపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతుండగా, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ముఖ్యంగా దుమ్ములపేట రైల్వే గేటు దాటిన తరువాత గోడౌన్లు ఉన్న ఎన్‌సీఎస్ స్టోరేజ్, రుచి రిఫైనరీ ఆయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రెండు అడుగులకు పైగా లోతున గోతులు పడడంతో, ద్విచక్ర వాహనాలు మొదలుకొని భారీ వాహనాల వరకు చాలా ఇబ్బందికరంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ మార్గం నుంచి ఎక్కువగా కుంభాభిషేకం రేవు, సీ పోర్టు, ఫిషింగ్ హార్బర్, యాంకరేజ్ పోర్టు, మెరైన్ స్టేషన్, కోస్ట్‌గార్డు స్టేషన్లతో పాటు, ముఖ్యమైన గోదాములు ఉన్నాయి.

నిత్యం రాకపోకలు

సముద్రంలో చేపల వేట సాగించే దుమ్ములపేట మత్స్యకారులు ఈ ప్రాంతం నుంచి నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డుకు నిర్లక్ష్యం ఆవరించింది. అధికారుల నిర్లక్ష్యమో.. గ్రహపాటో తెలియదు కానీ దీనిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతికి ముందు మొక్కుబడిగా కొన్ని గోతుల్లో కంకర వేసి, మరమ్మతులు చేశారు. తర్వాత వీటిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో గోతుల్లో నీరు నిలిచిపోయి, రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని రోడ్డు నిర్మాణం జరిపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టినట్టు ప్రకటనలు చేసే కూటమి నాయకులు.. దుమ్ములపేట-కుంభాభిషేకం రేవుకు వెళ్లే రోడ్డును సందర్శిస్తే వాస్తవం తెలుస్తుందని అంటున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణంపై తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గతంలో పూడ్చిన చోటే ఏర్పడిన గోతులు

ఆటో దెబ్బతింది



పెద్ద పెద్ద గతుకులు ఏర్పడడంతో ఆటో బాడీ విరిగిపోయింది. ఇలాగే చాలా ఆటోలు దెబ్బ తింటున్నాయి. రోడ్డుపై గతుకులు పూడ్చి, కొత్తగా నిర్మాణం చేపట్టాలి. చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పేర్ల కుమార్, ఆటో కార్మికుడు, దుమ్ములపేట

రోడ్డు నిర్మించాలి



ద్విచక్ర వాహనదారులు, సైకిళ్లపై వెళ్లే వారితో పాటు, కార్లు, ఇతర వాహనాలపై దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రోడ్డు మీదుగా ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి, వీరి ఇబ్బందులు పరిష్కరించాలి.

– మల్లాడి విజయ్, మత్స్యకారుడు

నీటి పన్నును వెంటనే చెల్లించాలి

కాకినాడ సిటీ: డివిజన్‌లోని రైతులు ఫసలీ 1430 నుంచి 1434 ఫసలీ వరకు ఉన్న నీటి పన్నును గ్రామ సచివాలయాల్లో చెల్లించేలా సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 2020లో వచ్చిన 1430 ఫసలీ సాంకేతిక కారణాల వల్ల వ్యవసాయ భూములకు నీటి పన్నును కట్టించుకోలేదన్నారు. దీంతో రైతులు బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం ఆయా సాంకేతిక కారణాలను తొలగించి 2020కు ముందున్న బకాయిలు నిర్ధారించి, 2024 వరకు నీటి పన్నును సచివాలయాల్లో చెల్లించేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వీఆర్వోల ద్వారా డిమాండ్ నోటీసులు పొందిన వెంటనే నీటి పన్నును చెల్లించాలన్నారు. రైతులు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు వ్యవసాయ భూముల వివరాలను తెలిపి, నీటి పన్నును నగదు లేదా యూపీఐ విధానంలో చెల్లించి, రసీదు పొందాలన్నారు. చెల్లించిన నీటి పన్ను వివరాలు అడంగల్‌లో ఆన్‌లైన్‌లో నమోదై, రెవెన్యూ రికార్డుల్లో భూమి అనుభవాన్ని తెలియజేస్తుందన్నారు. నీటి పన్నును గ్రామ నీటి సంఘం ద్వారా కాలువలు, నీటి పారుదల వనరుల అభివృద్ధికి ఉపయోగిస్తారన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: కాకినాడ ఆర్టీసీలో పలువురు ఉద్యోగులు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. గత 37 ఏళ్లుగా సీహెచ్ వజ్రం, ఎంఎస్ఎన్ రాజు, ఎ.రామారావు, పి.సుదర్శన్, వి.శార్వాణి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు పాల్గొన్నారు.

బోధనకే వన్నె తెచ్చారు

ఘనంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ మేరీ సుగుణ మణి ఉద్యోగ విరమణ వేడుక



మేరీ సుగుణ మణిని సత్కరిస్తున్న ప్రముఖులు

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మేరీ సుగుణ మణి ఉద్యోగ విరమణ వేడుక ఘనంగా జరిగింది. కళాశాల యాజమాన్యం, సహోద్యోగుల సంయుక్తాధ్వర్యంలో ఆర్ఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ హాజరయ్యారు. ఆమె సేవలను వారు కొనియాడారు. నర్సింగ్ సేవల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించడంలో సుగుణ కీలక భూమిక పోషించి, బోధనకే వన్నె తెచ్చారన్నారు. సమర్థులైన నర్సులను సమాజానికి అందించారని కొనియాడారు. వైద్యేతర వృత్తిలో కొనసాగే నర్సులకు, వైద్యులకు సమానమైన గౌరవ మర్యాదలు అందేందుకు వృత్తి జీవితంలో అనుసరించాల్సిన విధానాలను బోధించి, నర్సుల భవితను సన్మార్గంలో నడిపేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. ఎందరో ఉత్తమ నర్సులను సమాజానికి అందించిన ఆమె భవిత బంగారుమయం కావాలని, పరిపూర్ణ ఆరోగ్యంతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన మేరీ సుగుణ మణిని అభినందించేందుకు పూర్వ విద్యార్థులూ తరలివచ్చారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి సహా, మెడికల్, నర్సింగ్ కళాశాలల సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, కార్యదర్శి వెంకటకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు మాట్లాడుతూ, మేరీ సుగుణ మణి సేవలు ఆదర్శనీయమన్నారు.

రజక స్థలాన్ని పరిరక్షించాలి

కలెక్టరేట్ వద్ద రజక వృత్తిదార్ల సంఘం ధర్నా



రజక నేతల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: యు.కొత్తపల్లి మండలం మూలపేట గ్రామంలో రజకులు దశాబ్దాల నుంచి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఆ స్థలాన్ని పరిరక్షించి పట్టాలివ్వాలని, దోభీ ఘాట్ నిర్మించాలని కోరుతూ సోమవారం ఏపీ రజక వృత్తిదార్ల సంఘం కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు, కాకినాడ అధ్యక్షుడు పి.లింగమహేశ్వరరావు మాట్లాడుతూ, మూలపేట గ్రామంలో రజక వృత్తి స్థలాన్ని సర్వే చేయించాలని, స్థలం చుట్టూ ఆక్రమణలు నిరోధించటానికి ఫెన్సింగ్ వేయించాలన్నారు. ఆ స్థలాన్ని మూలపేట గ్రామ రజక వృత్తిదారుల సంఘం పేరున పట్టా ఇప్పించాలని కోరారు. అలాగే ఆ స్థలంలో రజక లేదా బీసీ కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరు చేసి, ఆరు బల్లలతో కూడిన దోబీఘాట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిని సామాజిక అవసరంగా భావించి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భవిష్యత్తులో రజక వృత్తిని, చెరువుల స్థలాలను కాపాడకపోతే వృత్తి అంతరించే అవకాశం ఉందన్నారు. ఇదే సమయంలో కలెక్టరేట్‌లోకి వెళుతున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి.. రజక నాయకులు చెప్పిన సమస్యలను ఆలకించి, వినతిపత్రం స్వీకరించారు. ఈ సమస్యపై విచారణ జరిపించి, తగిన స్థాయిలో సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘ నాయకులు పి.లోవరాజు, పాకలపాటి లక్ష్మి, పాలెపు రమణ, సీత, లక్ష్మీదుర్గ, దివ్య, నూకరత్నం, అప్పారావు, గని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వీరి ధర్నాకు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

9న సార్వత్రిక సమ్మె



సదస్సులో సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కాకినాడ రూరల్: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేల చొప్పున చెల్లించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని వలసపాకల గ్రామంలో అగ్నికుల క్షత్రియ ఫంక్షన్ హాలులో సీఐటీయూ మండల శాఖ కార్యదర్శి టి.రాజా అధ్యక్షతన సోమవారం సదస్సు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్తిరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఆదినారాయణ, చింతపల్లి అజయ్ తదితరులు ప్రసంగించారు. కార్మికుల పొట్టకొట్టేలా మోదీ సర్కారు లేబర్ కోడ్ చట్టాలు తీసుకువస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శ్రీహరి, బలరాం, రాంబాబు, దుర్గాప్రసాద్, రాజు, శ్రీను, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈఓకు ఘనంగా వీడ్కోలు



లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ ఈఓగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన మాచిరాజు లక్ష్మీనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. సర్పవరం ఆలయంలో సోమవారం సాయంత్రం ఈఓ బాధ్యతల నుంచి రిలీవ్ అయిన లక్ష్మీనారాయణను సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు. దేవదాయ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘ సేవలందించిన లక్ష్మీనారాయణ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలతో పాటు, ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ పనిచేశారు. ప్రస్తుతం ఆయన మురముళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఈఓగా, సర్పవరం ఆలయ ఈఓగా పనిచేస్తూ, వీఆర్ఎస్ తీసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు జ్ఞాపికలను అందజేసి, సత్కరించారు.

తహసీల్దార్‌కు ఆర్డీఓ సత్కారం



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఆర్డీఓ తదితరులు

కరప: తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం రాత్రి రెవెన్యూ సిబ్బంది తరఫున ఆర్డీఓ ఎస్.మల్లిబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పని చేసి, ప్రజలు, అధికారుల మన్ననలు పొందారన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఏఏలు, కుటుంబ సభ్యులు తహసీల్దార్ సత్యనారాయణ దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తన 39 ఏళ్ల సర్వీసులో సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, కాకినాడ రూరల్, రాయవరం, పెదపూడి మండలాల తహసీల్దార్లు లక్ష్మి, ఐడీ శెట్టి, సీతాపతి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, ఆర్ఐ పవన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంతా ఇల్లింద్రాడలోనేనా..?

అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సూర్యావతి

పిఠాపురం: రూ వందల కోట్లు మంజూరయ్యాయని, ఎక్కడా లేని అభివృద్ధి ఇక్కడ చేసేస్తున్నామంటున్నారు కానీ, ఇక్కడేమీ కనిపించడం లేదని కౌన్సిలర్ బోను దేవ అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి అంతా ఉప ముఖ్యమంత్రి స్థలాలు కొన్న ఇల్లింద్రాడ పరిధిలోనే జరుగుతోందని, గొల్లప్రోలు వైపే అధికారులు చూస్తున్నారని, పిఠాపురాన్ని పట్టించుకోవడం మానేశారని అధికారుల తీరును దుయ్యబట్టారు. పట్టణంలో నెలకొన్న అధ్వాన పారిశుధ్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారుల తీరు మారడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబట్టారు. ఎక్కడ చెత్త అక్కడే ఉంటోందని ఏడో వార్డు కౌన్సిలర్ బోను దేవా ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో వర్కర్లను పక్క వార్డుల్లోకి మార్చడం ఎందుకని, కనీసం వార్డుల్లో బ్లీచింగ్ చల్లి ఆరు నెలలైందన్నారు. అసలే వర్షాకాలమని, పారిశుధ్య నిర్వహణ ఇలా కొనసాగితే ప్రజలు రోగాల బారిన పడడం ఖాయమని రెండో వార్డు కౌన్సిలర్ ఎస్.లలిత ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల వెంబడి చెత్తను వెదజల్లేందుకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారా, చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్నారా అంటూ పదో వార్డు కౌన్సిలర్ అల్లవరపు నగేష్ ప్రశ్నించారు. చెత్త ట్రాక్టర్ల పనితీరు అధ్వానంగా ఉందని కౌన్సిలర్ చెల్లూరు లోవరాజు అన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ, పలు వార్డుల్లో శానిటేషన్ సరిగ్గా జరగటం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావట్లేదన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో 13 అంశాలు చర్చకు రాగా, 3 అంశాలను వాయిదా వేసి, పది అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

దళిత కాలనీల్లో అభివృద్ధిని ఆపితే ఊరుకోం

అగ్రహారం కాలనీవాసుల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

పిఠాపురం: దళిత కాలనీల్లో అభివృద్ధిని ఆపితే ఊరుకోబోమంటూ పిఠాపురం అగ్రహారం కాలనీవాసులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత కాలనీల్లో అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా అధికారులు అడ్డుకుంటున్నారని కాలనీ నాయకులు బత్తిన రాజశేఖర్, వజ్రపు వీరేష్ తదితరులు ఆరోపించారు. అగ్రహారం కాలనీలో మూతపడిన కబేళాను తెరిచేందుకు అధికారులు యత్నిస్తున్నారని, కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేసే కబేళాను తెరిస్తే సహించేది లేదన్నారు. కబేళాను వేరేచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.30 కోట్లతో 1, 30 వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు అధికారులు టెండర్లకు పిలవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి కాలనీవాసులు వినతిపత్రం అందించారు. జూన్ 15లోపు టెండర్లు పిలుస్తామని, కబేళా విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని కమిషనర్ ఎస్.కనకరావు తెలిపారు.